క్లుప్తంగా

దుర్గాదేవికి ఆషాఢం సారె సమర్పణ



తాడిపర్రులో అమ్మవారి ఆషాఢం సారెతో మహిళ భక్తులు

ఉండ్రాజవరం: ఆషాఢమాసం సందర్భంగా మండలంలో తాడిపర్రు గ్రామంలో ఆదర్శ నగర్‌లో కొలువైయున్న కనకదుర్గమ్మ అమ్మవారికి శనివారం గ్రామానికి చెందిన మహిళా భక్తులు అషాఢ మాసం సారె, చీర సమర్పించారు. ఈ సందర్భంగా అమ్మవారికి కుంకుమ పూజలు, లలిత సహస్రనామ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు.

ఖాళీలను భర్తీ చేయండి



కొవ్వూరు ఆర్డీవోకు సమస్యలను వివరిస్తున్న జిల్లా క్లాస్-4 ఉద్యోగులు

తాళ్లపూడి(కొవ్వూరు): స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద శనివారం జిల్లా క్లాస్-4 ఉద్యోగులు సమావేశం నిర్వహించారు. ఈ మేరకు నాల్గోవ తరగతి ఉద్యోగుల ఖాళీ పోస్టులను త్వరితగతిన భర్తీ చేయాలని, ప్రతి సంవత్సరం సమయానికి యూనిఫాం పంపిణీ చేయాలనే వంటి అంశాలపై దృష్టి సారించవలసిందిగా ఆర్డీవో రాణి సుస్మితను కలిసి విజ్ఞప్తి చేశారు. తూర్పు గోదావరి జిల్లా క్లాస్-4 ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు చిలకల వెంకటరమణ మాట్లాడుతూ ప్రతి మండలంలో కనీసం రెండు అటెండర్ పోస్టులు, ఒక నైట్ వాచ్‌మెన్ పోస్టు ఉండాలని, ప్రస్తుతం చాలా చోట్ల ఈ పోస్టులు ఖాళీగా ఉండటంతో సేవలందించడంలో తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని సమావేశంలో పేర్కొన్నారు. ఉద్యోగుల రక్షణ, సేవా సామర్థ్యం పెంచేందుకు వీటి భర్తీ అత్యవసరమని అభిప్రాయాని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో సభ్యులు ఎండీ తాజుద్దీన్, ఎం.సుబ్రమణ్యం తదితర ఉద్యోగులు పాల్గొన్నారు.

అన్యమత ప్రచారంపై ఆందోళన



పెద్దేవంలో అన్యమత ప్రచారంపై ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

తాళ్లపూడి: మండలంలోని పెద్దేవంలోని సంపతి వినాయక ఆలయం సమీపంలో అన్యమత ప్రచారం నిర్వహిస్తున్నారని హిందువుల మనోభావాలు దెబ్బతినేలా వ్యహరిస్తున్నారని గ్రామస్తులు శనివారం ఆందోళనకు దిగారు. పెద్దేవం గ్రామంలో సంపత్ వినాయకుని మందిరానికి అత్యంత సమీపంలో క్రైస్తవ ప్రార్థనలు చేస్తూ చర్చిలు ఏర్పాటు చేయటం పట్ల హిందువులకు చెందిన యువత ఆగ్రహాన్ని వ్యక్తం చేస్తు ఆ చర్చి వద్ద బైఠాయించారు. హిందువులు ఇళ్ల మధ్య, వినాయక మందిరం ఎదురుగా కిరాణా దుకాణదారుడు క్రైస్తవ ప్రార్థనలు చేస్తూ, ఇంటిపై చర్చిని ఏర్పాటు చేసి ప్రార్థనలతో ఇబ్బంది పెడుతున్నారని పోలీసులు ఇరు వర్గాలతో మాట్లాడి వివాదాన్ని సద్దుమణిగించారు.

మొక్కలతో పర్యావరణ రక్షణ

కడియం: విద్యార్థులందరూ మొక్కలు నాటి, పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములు కావాలని సర్పంచ్ పాతంశెట్టి రాంజీ, రెడ్ క్రాస్ అధికార ప్రతినిధి మహాలక్ష్మి రాంబాబు అన్నారు. కడియపులంక ప్రగతి విద్యా నికేతన్ ఆవరణలో బ్లూడే వేడుకలు శనివారం ఆ విద్యాసంస్థ కరస్పాండెంట్ యోహాను అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో బోడపాటి రాజేశ్వరి, పాఠశాల డైరెక్టర్ ప్రదీప్, రెడ్ క్రాస్ ప్రతినిధులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విద్యుత్ స్మార్ట్ మీటర్లను ఉప సంహరించుకోవాలి

నిడదవోలు: స్థానిక విద్యుత్ డీఈఈ కార్యాలయం వద్ద పట్టణ కాంగ్రెస్ ఆధ్వర్యంలో విద్యుత్ స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా శనివారం నిరాహార దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు మేడవరపు భద్రందొర మాట్లాడుతూ విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిరంకుశ వైఖరికి నిరసనగా నిరాహార దీక్ష కార్యక్రమం చేపట్టామన్నారు. ఇదే కూటమి నాయకులు ఎన్నికలకు ముందు ప్రతిపక్షంలో ఉండగా స్మార్ట్ మీటర్లు పెడితే ధ్వంసం చేయండి అని చెప్పి అధికారం చేపట్టిన తర్వాత స్మార్ట్ మీటర్ల ప్రక్రియను వేగవంతం చేసిందని విమర్శించారు. కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అరిగెల అరుణ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఏటిగట్టు.. ఏదీ పట్టు!

- ఏటిగట్టు పగుళ్లపై భయాందోళనలు
- సొరంగాలను తలపిస్తున్న గోతులు
- కొద్దిపాటి వర్షానికే గాడులు ఏర్పడుతున్న తీరు
- మండలంలో 16 కిలోమీటర్ల మేర అధ్వానం



తీపర్రు వద్ద కాలువలా దర్శనమిస్తున్న ఏటిగట్టు

పెరవలి: ఏటిగట్టు..భయ పడేటట్టు ఉంది. కూటమి పాలకుల నిర్లక్ష్యం కారణంగా ఉభయ గోదావరి జిల్లాలోని గోదావరి పరీవాహక ప్రాంతంలోని గోదావరి ఏటిగట్ల పటిష్టత లేకుండాపోయింది. మండలంలోని తెలుగు తమ్ముళ్లకు ఉచిత ఇసుక లక్షాధికారులను చేస్తే లక్షల మందికి కాపు కాసే ఏటిగట్టు మాత్రం అధ్వానంగా తయారైయ్యింది. గోదావరి అంటే కేవలం ఇసుక దోపిడీ కోసం అన్నట్టుగా మార్చేసి ఇష్టానుసారం ర్యాంపులను తవ్వేస్తు గట్లను గుల్ల చేసేస్తున్నారు. అదే ఇప్పుడు ప్రమాదకరంగా మారింది. ఎక్కడైనా గట్టు తెగిందా 1986 రిపీట్ అయ్యే అవకాశం ఉంది. గోదావరి కుడి, ఎడమ గట్లు పొడవు 530 కిలోమీటర్లు. ధవళేశ్వరం బ్యారేజీ ఎగువన 80 కిలోమీటర్లు ఉండగా దిగువన కోనసీమ, తూర్పు, పశ్చిమ జిల్లాల పరిధిలో 450 కిలోమీటర్ల ఏటిగట్లు ఉన్నాయి.

ఇష్టానుసారం రాకపోకలు

ఏటిగట్టుపై ఇసుక లారీలు ఇష్టానుసారం రాకపోకలు సాగించటంతో గట్టు ఎక్కడిక్కడ దిగబడి ప్రమాదాలకు నిలయంగా మారింది. ఏటిగట్టు నిర్మాణ పనుల్లో నాణ్యత లోపంతో నేడు గట్లు కృంగిపోవటానికి మరో కారణంగా గ్రామస్తులు వాపోతున్నారు. ప్రస్తుతం కురుస్తున్న కొద్దిపాటి వర్షాలకు గట్టు ఎక్కడిక్కడ, అండలు జారిపోవడం, కోతకు గురై సొరంగాల మాదిరిగా భారీ రంధ్రాలు ఏర్పడటంతో తీరప్రాంత ప్రజలు భయాందోళనలు చెందుతున్నారు. ఏటిగట్టుపై భారీ వాహనాలు తిరుగుతున్నప్పుడు లంక రైతులు ఫిర్యాదులు చేసినా అధికారులు పట్టించుకోకపోవడంతో నేడు గట్టంతా అండలుగా విరిగి, గట్టుపై పగుళ్లు ఏర్పడ్డాయి. కానూరు అగ్రహారం నుంచి సిద్ధాంతం బ్రిడ్జి వరకు పలు చోట్ల 20 మీటర్లు పైబడి గట్లు అండలు జారిపోయి విరిగిపడిపోవడంతో డెల్టా గ్రామాల ప్రజలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

సొరంగాలను తలపిస్తున్న గోతులు

దివంగత ముఖ్యమంత్రి వై.యస్.రాజశేఖర్‌రెడ్డి నాడు రూ.146 కోట్లతో ఏటిగట్టు అభివృద్ధి పనులను చేపడితే అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించటంతో గట్టుకి ఈ దుస్థితి వచ్చిందని పలువురు స్థానికులు తీవ్రంగా విమర్శిస్తున్నారు. కానూరు అగ్రహారం, తీపర్రు, కాకరపర్రు, ముక్కామల, ఉమ్మిడివారిపాలెం, ఖండవల్లి, లంకమాలపల్లి, ఉమ్మిడివారిపాలెం, ఓదూరివారిపాలెం, సిద్ధాంతం సమీపంలో గట్టు అండలు జారిపోయాయి. ఇవి ఏటిగట్టు అంచు నుంచి 30 మీటర్లు పొడవు కలిగి గట్టు విరిగిపడటంతో పాటు, పెద్దపెద్ద గాడులు ఏర్పడి భయంకరంగా కనిపిస్తున్నాయి. ఏటిగట్టు మధ్యలో ఏర్పడిన గోతులు సొరంగాలను తలపించే విధంగా ఉండటంతో ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గట్టుపై రోడ్డు నిర్మాణం చేయవలసి ఉన్న నేపథ్యంలో గట్టు ఇలా జారిపోవడంతో తీవ్ర ఆందోళనకు గురిచేస్తుంది. ఉచిత ఇసుక విధానం అమలు చేయటంతో ఎక్కడి పడితే అక్కడ ర్యాంపుల ఏర్పాటు చేసి దొరికింది దొరికినట్లు దేచేస్తున్నారు తమ్ముళ్లు.

1986 నాటి పరిస్థితులు వస్తే..

ఏది ఏమైనా గట్టుల పట్ల అధికారులు తగు చర్యలు తీసుకోకపోతే గట్టు మొత్తం కూలిపోయే పరిస్థితి ఉంటుందని స్థానికులు చెపుతున్నారు. 1986లో వచ్చిన గోదావరి మరోసారి వస్తే ఈ సారి ఏటుగట్టు ఎక్కడి పడితే అక్కడ గండ్లు పడతాయని గట్టు మొత్తం దిగబడి గాడులు పడి ఉందని దీని వలన వరద ఏమాత్రం గట్టును తాకినా నిలువునా కూలిపోతుందని వందలాది గ్రామాలు ముంపు బారిన పడుతాయని వెంటనే అధికారులు స్పందించి ఏటిగట్టు పటిష్టకు చర్యలు చేపట్టాలని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

భారీ వాహనాలతో ఛిద్రం



ఏటిగట్టు ఎంతో బాగుండేది ఇసుక లారీలు, భారీ వాహనాలు తిరగటంతో మొత్తం పాడైపోయింది. ఎక్కడపడితే అక్కడ ర్యాంపులు వేశారు. దీనితో గట్టు తీవ్రంగా దెబ్బతిని, రోడ్డే లేకుండా పోయింది.

– సిహెచ్.శ్రీరామ చంద్రమూర్తి, రైతు, ఖండవల్లి.

అధికారుల నిర్లక్ష్యం



ఇసుక లారీలు, ట్రాక్టర్లు, మట్టి ట్రాక్టర్ల వలన ఏటిగట్టు నాశనమయ్యింది. అధికారులకు, ప్రజాప్రతినిధులకు పలుమార్లు చెప్పినా పట్టించుకోవడం లేదు. వర్షాలకు ఏటిగట్టు దిగబడుతుంది. వరదలు వస్తే ఏంజరగుతుందోనని భయంగా ఉంది.

వేంద్ర ఏసు, లంకరైతు, ముక్కామల.



ఖండవల్లి వద్ద జారిపోయిన ఏటిగట్టు



ముత్యాలవారిపాలెం వద్ద కోతకు గురైన ఏటిగట్టు



కాకరపర్రు వద్ద కోతకు గురై ఏర్పడిన గాడి

మాజీ సర్పంచ్ మృతి



రాయుడు ధర్మారావు పార్థివదేహానికి నివాళులర్పిస్తున్న తానేటి వనిత

నల్లజర్ల: నల్లజర్ల గ్రామ మాజీ సర్పంచ్ రాయుడు ధర్మారావు(85) శనివారం ఉదయం మృతి చెందారు. మాజీ హోంమంత్రి, గోపాలపురం నియోజకవర్గ వైఎస్సార్ సీపీ ఇన్‌చార్జి తానేటి వనిత నల్లజర్లలో ఆయన పార్థివ దేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన మనవడు నల్లజర్ల ఉప సర్పంచ్ రాయుడు విజయకుమార్‌తో మాట్లాడారు. కార్యక్రమంలో ఆమె వెంట పార్టీ నాయకులు మండల కన్వీనర్ వెల్లంకి వెంకట సుబ్రమణ్యం, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు నక్కా పండు, మైనార్టీ సెల్ అధ్యక్షుడు సయ్యద్ మునాఫ్, బీసీ సెల్ అధ్యక్షుడు చిన్నీ నాగూయాదవ్, మండల ఎస్సీసెల్ అధ్యక్షుడు అందుగుల వెంకటేశ్వరావు, యువరాజు, వల్లూరి శేషగిరి, కండెపు రామకృష్ణ తదితరులు ఉన్నారు.

ద్విచక్ర వాహనాల ఢీ



క్షతగాత్రుడు హేమంత్‌కు సపర్యలు చేస్తున్న స్థానికులు

తాళ్లపూడి: మండలంలోని తిరుగుడుమెట్ట లోని వైఎస్సార్ విగ్రహం మలుపు వద్ద ఎదురెదురుగా రెండు మోటార్‌సైకిళ్ల ఢీ కొన్న సంఘటనలో శనివారం ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాలు ప్రకారం గ్రామానికి చెందిన కొమ్మిశెట్టి హేమంత్‌ను అదే గ్రామానికి చెందిన గోతం రాజు అనే వ్యక్తి ఎదురుగా వచ్చి వేగంగా ఢీకొట్టడంతో తలకు బలంగా గాయమయ్యింది. గ్రామస్తులు అతడికి సపర్యలు చేస్తుండగా తాళ్లపూడి ఎస్సై టి.రామకృష్ణ గ్రామానికి అదే సమయంలో బందోబస్తు నిమిత్తం రావడంతో పోలీస్ జీప్‌పై క్షతగాత్రుడుని కొవ్వూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

ఇసుక లారీ సీజ్



సీజ్ చేసిన లారీతో ఏఎస్సై గంగాధరరావు

నిడదవోలు రూరల్: ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్న క్వారీ లారీని సీజ్ చేసి కేసు నమోదు చేసినట్లు కొవ్వూరు సబ్ డివిజన్ టాస్క్‌పోర్స్ ఏఎస్సై జీఆర్‌కే గంగాధరరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. కొవ్వూరు మండలం వాడపల్లి ఇసుక ర్యాంపు నుంచి ఎటువంటి బిల్లులు లేకుండా నిడదవోలు వైపు ఇసుక తరలిస్తుండగా పక్క సమాచారంతో సమిశ్రగూడెం వద్ద పోలీసులు తనిఖీలు నిర్వహించి లారీని స్వాధీనం చేసుకున్నామన్నారు. కేసు నమోదు చేసి లారీని స్థానిక స్టేషన్‌కు తరలించామని వెల్లడించారు.

వేతనాలు చెల్లించకపోతే బతికేది ఎలా..?



ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న రాంబాబు

నిడదవోలు రూరల్: ఉపాధి హామీ కూలీల వేతన బకాయిలను వెంటనే చెల్లించాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యులు జువ్వల రాంబాబు డిమాండ్ చేశారు. మండలంలోని సింగవరం గ్రామంలో శనివారం ఉపాధిహామీ పనులు నిర్వహిస్తున్న కూలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ మేరకు గత మూడు నెలలు పనిచేసినా వేతనాలు ఇవ్వడం లేదని కూలీలు ఆయనతో ఆవేదన వ్యక్తం చేశారు. నెలలు తరబడి వేతనాలు ఇవ్వకపోతే కూలీలు ఎలా బ్రతుకుతారని ఆయన ప్రశ్నించారు. వెంటనే ప్రభుత్వం స్పందించి బకాయిలను చెల్లించాలని పని ప్రదేశాల్లో కూలీలు చనిపోతే రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

భాగస్వామిని కోల్పోవటం బాధకరం



మృతదేహానికి నివాళులర్పిస్తున్న శ్రీనివాస్ నాయుడు

పెరవలి: జీవిత భాగస్వామిని కోల్పోవటం చాలా బాధాకరమని, ధైర్యంగా కుటుంబ సభ్యులకు పెద్దదిక్కులా అండగా ఉండాలని మాజీ ఎమ్మెల్యే జి.శ్రీనివాస్ నాయుడు హితవు పలికారు. పెరవలి మండలం కానూరు గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ నాయకుడు కరుటూరి శ్రీనివాస్ భార్య లక్ష్మి (46) శనివారం ఉదయం హఠాత్తుగా గుండెపోటుతో మృతి చెందారు. ఈ మేరకు సమాచారం తెలుసుకుని ఆయన మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. భార్యను కోల్పోవడం దురదృష్టకరమని, ఎవరికీ ఇటువంటి పరిస్థితి రాకూడదన్నారు. అనంతరం ఇదే గ్రామంలో వీరమళ్ల సీతయ్య (103) ఇటీవల మృతి చెందటంతో వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు వీరమళ్ల సత్యానారాయణ, రామడుగుల సూర్య నారాయణ, కరుటూరి గోపి, తోట సురేష్ పాల్గొన్నారు.

యమపాశాల్లా స్పీడ్ బ్రేకర్లు



కృష్ణంపాలెం వద్ద ప్రమాదకరంగా స్పీడ్ బ్రేకర్లు

దేవరపల్లి: రహదారులపై జరుగుతున్న రోడ్డు ప్రమాదాలను నివారించడానికి ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు ప్రమాదకరంగా మారాయి. దేవరపల్లి మండలం కృష్ణంపాలెం వద్ద గుండుగొలను–కొవ్వూరు ప్రధాన రహదారి నుంచి హైవే సర్వీస్ రోడ్డు ద్వారా జాతీయరహదారి పైకి వెళ్లే ప్రాంతంలో స్పీడ్ బ్రేకర్లు లేక ప్రమాదాలు జరుగుతున్నాయి. ప్రమాదాలను గమనించిన అధికారులు హైవేపై వంతెన సమీపంలోని సర్వీస్ రోడ్డుపై ఇటీవల స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. వీటికి ఎటువంటి రంగులు వేయక రోడ్డులో కలిసిపోవడంతో రాత్రిళ్లు కనిపించక ప్రజలు ప్రమాదాలకు గురవుతున్నారు. స్పీడ్ బ్రేకర్లకు తెలుపు రంగు వేసి సూచిక బోర్డు ఏర్పాటు చేయాలని ప్రయాణీకులు కోరుతున్నారు.

పుత్రశోకం తీర్చలేనిది



హరికిరణ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న తలారి వెంకట్రావు

చాగల్లు: మండలంలోని చిక్కాల గ్రామంలో వైఎస్సార్ సీపీ నాయకుడు రామకృష్ణ గౌడ్‌ను మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ ఇన్‌చార్జి తలారి వెంకట్రావు శనివారం పరామర్శించారు. పెద్ద కుమారుడు శనగన హరికిరణ్ గౌడ్ ఇటీవల అమెరికాలో జలపాతం వద్ద ప్రమాదవశాత్తూ జారిపడి మృతి చెందిన విషయం విధితమే. ఈ మేరకు కుటుంబ సభ్యులను ఆయన పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. చేతికి అందివచ్చిన కుమారుడు మృతి చెందడం బాధకరమన్నారు. పుత్రశోకం ఏ తల్లికి తీర్చలేనిదని, కుటుంబానికి పార్టీ నాయకులు అండగా ఉంటామని ఓదార్చారు. అనంతరం హరికిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో పార్టీ యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు కంఠమణి రమేష్‌బాబు, సర్పంచ్ కొయ్యే మణి, మండల పార్టీ అధ్యక్షుడు మట్టా వెంకట్రావు, మాజీ ఏఎంసీ చైర్మన్ ఉప్పులూరి సూరిబాబు పరామర్శించిన వారిలో ఉన్నారు.

లంకల్లో డ్రోన్లతో విస్తృత దాడులు



నిందితులతో ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ హనుశ్రీ, సిబ్బంది

రాజమహేంద్రవరం రూరల్: జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఆఫీసర్ చింతాడ లావణ్య ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలు ఉపయోగించి గోదావరి లంకల్లోని సారా బట్టీలపై శనివారం దాడులు నిర్వహించారు. గోంగూర లంక, షూటింగ్ లంక, బ్రిడ్జిలంకల్లో జరిగిన ఈ దాడుల్లో రెండు కేసులు నమోదు చేసి, 3,400 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 160 లీటర్ల సారా, పడవ, రెండు మోటారు సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. తాడితోటకు చెందిన బండారు దుర్గా ప్రసాద్, వనం వెంకటేష్, వెంకటనగరానికి చెందిన గంగోతు బంగారు, ద్వారపూడికి చెందిన అయినవిల్లి స్వామిసాగర్, కోటిలింగాలపేటకు చెందిన తెలగంశెట్టి శ్రీనివాసరావును అరెస్టు చేశారు. ఈ కేసులో ప్రధాన నిందితులైన సంజీవ నగర్‌కు చెందిన బుడగా దేవుడు, వెంకటనగరానికి చెందిన కంగ్రోతు వెంకన్నబాబు పరారీలో ఉన్నారని జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి చింతాడ లావణ్య తెలిపారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ (ఇన్‌చార్జి నార్త్‌స్టేషన్ ఇన్‌స్పెక్టర్) పి.హనుశ్రీ, ఎస్సై ఎం.శ్రీనివాసరావు, సిబ్బంది పాల్గొన్నారు.

వారిపై చర్యలు తీసుకునే వరకూ పోరాటం



ఆనంద్ కుమార్

సీటీఆర్‌ఐ: మట్టి అక్రమ తవ్వకాలపై ఫిర్యాదు చేశాడన్న కారణంతో ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన రాంబాబు జీవనాధారాన్ని పోగొట్టిన రాజానగరం మండల తహసీల్దార్ జీఎల్ఎస్ దేవి, ఆమెకు అండగా నిలిచిన సీఐ వీరయ్య గౌడ్‌పై చర్యలు తీసుకునే వరకూ పోరాటం సాగిస్తానని స్వతంత్ర జనతా పార్టీ (రిపబ్లిక్) అధ్యక్షుడు బర్రే ఆనంద్ కుమార్ అన్నారు. నగరంలోని పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రాజానగరం మండలంలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలకు తహసీల్దార్ అండగా ఉంటున్నారని, ఆమెకు మద్దతుగా సీఐ వీరయ్య గౌడ్ వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. పల్లకడియం గ్రామంలో అక్రమంగా చెరువులు తవ్వుతూ, చెరువుగట్లపై ఉన్న చెట్లను సైతం పెకలించి, లక్షల క్యూబిక్కుల మట్టిని తరలిస్తున్నారన్నారు. ఈ విషయంపై గ్రామస్తుడైన ఇజ్జిన రాంబాబు, మరికొందరితో కలిసి మార్చిలో జిల్లా కలెక్టర్ ప్రశాంతికి ఫిర్యాదు చేశారన్నారు. అప్పటి నుంచి స్థానిక నాయకులను ఉపయోగించుకొని వారిపై దాడులకు పాల్పడడం ప్రారంభించారన్నారు. సమావేశంలో ఇజ్జిన రాంబాబు, భార్య శాంతిరత్న పాల్గొన్నారు.

కార్పొరేషన్‌కు మినిస్టీయల్ అవార్డు



కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగర పాలక సంస్థకు గొప్ప గౌరవం దక్కింది. మినిస్టీయల్ అవార్డు (రాష్ట్రస్థాయి) కేటగిరికి ఎంపికై గౌరవ ప్రదమైన మంత్రివర్గ పురస్కారం పొందనుంది. ఈ విషయాన్ని కలెక్టర్ పి.ప్రశాంతి శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. న్యూఢిల్లీలో జూలై 17న జరిగే కార్యక్రమంలో అవార్డు అందజేయనున్నారు. అవార్డును స్వీకరించేందుకు కేవలం ముగ్గురు ప్రతినిధులకు మాత్రమే వేదికపైకి అనుమతి ఇస్తారు. జిల్లా కలెక్టర్, ఇన్‌చార్జి కమిషనర్ పి.ప్రశాంతి ఈ పురస్కారాన్ని స్వీకరించనున్నారు. నగరపాలక సంస్థ చేపట్టిన అభివృద్ధి, ప్రజాసేవ కార్యక్రమాలకు ఈ గౌరవం లభించింది.

సీజనల్ ముప్పు




బ్రాహ్మణగూడెంలో డెంగీపై అవగాహన ర్యాలీ చేస్తున్న వైద్య సిబ్బంది

చాగల్లు: వర్షాకాలం సీజన్ ప్రారంభమై వర్షాలు కురుస్తున్నందున సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించేవారు తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోకపోతే వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని సూచిస్తున్నారు. ప్రధానంగా డెంగీ, చికెన్ గున్యా, టైఫాయిడ్, మలేరియా, మొదడువాపు వంటి వ్యాధులు ప్రబలుతాయి. కేవలం అప్రమత్తంగా ఉండడం వల్లే వ్యాధులకు దూరంగా ఉండవచ్చని వైద్యులు సూచిస్తున్నారు. ఈ క్రమంలో ప్రజలు వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు చాగల్లు మండలంలో బ్రాహ్మణగూడెం పీహెచ్‌సీ పరిధిలోని సిబ్బంది. ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా. అంగన్‌వాడీలు బందాలుగా ఏర్పాటు చేసి గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. డెంగీ మాసోత్సవాలులో భాగంగా అవగాహన ర్యాలీలు చేస్తున్నారు.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు..

ఇంటి చుట్టుపక్కల మురుగునీరు నిల్వ లేకుండా చూసుకోవాలి. శరీరం పూర్తిగా కప్పి ఉండేలా వస్త్రాలు ధరించాలి. దోమలు ఇళ్లల్లోకి రాకుండా కిటికీలు, తలుపులకు సన్నటి జాలీలు ఏర్పాటు చేసుకోవాలి. దోమ తెరలు వాడాలి. ఎప్పటికప్పుడు కాచి చల్లార్చిన నీటిని తాగాలి. ఇంటి ఆవరణలో ఖాళీ కొబ్బరి బొండాలు, వాడి పడేసిన టైర్లు ఉండకుండా చూసుకోవాలి. ఇంటిలో నిత్యం వినియోగించే రుబ్బురోళ్లు, తిరగళ్లు, ఫ్రిజ్లు, కూలర్లు, పూల కుండీలలో నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.

అశ్రద్ధ తగదు



వర్షాకాలం ప్రారంభంకావడంతో ప్రజలు తమ ఇళ్లతో పాటు చుట్టూ ఉండే పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు వేడి ఆహారం తీసుకోవాలి. వర్షాకాలంలో ఏమాత్రం జ్వరం వచ్చినా అశ్రద్ధ చేయకుండా ముందుగా వైద్యుడ్ని సంప్రదించాలి.

– డాక్టర్ మనోజ్, వైద్యులు, పీహెచ్‌సీ, చాగల్లు